# రాజు + రాంబాబు = నేను?

ఇంతక్రితం మీకు మా రాజు గురించి చెప్పానా? లేదుకదూ? అయితే, రాంబాబు గురించీ చెప్పిఉండను. ఏవంటే, వాళ్లిద్దరూ అవ్వాయి తువ్వాయి, సరీబేసీ, బొమ్మా బొరుసూ, తలుపూ ద్వారంబంధం, కప్పూప్లేటూ, ఇడ్లీ సాంబారూ, పెసరట్టూ ఉప్మా వగైరా వగైరాల్లా ఎప్పుడూ కలిసిమాత్రమే కనిపించే ఒక ద్వంద్వ సమాసమూ, మిశ్రమ పదార్థమూను.

ఒకడుంటే రెండోవాడు ఉన్నాడని వేరే చెప్పక్కర్లేదు. ఒకడిగురించి ప్రస్తావించామా రెండోవాడి ప్రసక్తి తెచ్చామన్నమాటే! ఇద్దర్లో ఏ ఒకణ్ని వదిలీ రెండో వాడిగురించి చెప్పడం అనేది, ససేమిరా జరిగేపని కాదు. అసలలా చెప్పినా అది సమగ్రం అయిచావదు. అసంపూర్ణంఅయి ఆ ఘోరించడమే కాకుండా, మహాపాపం ఒహటి వచ్చి నెత్తిన చుట్టుకుంటుంది ఆ చెప్పినవాడికి.

అవునా?

వీళ్ళిద్దరిదీ అంత అన్యోన్యమైన జంటకాబోలు, ఒకరి పోలికలు ఒకరికి, ఒకరి అలవాట్లు మరొకరికీ తప్పకుండా ఉండేఉంటాయి కాబోలు అని మీలో ఎవరేనా అనుకుంటేమాత్రం పూర్తిగా పప్పులో కాలేశారన్నమాటే!

ఏవంటే, ఒహడిది ఉత్తరధ్రువం మరొహడిది దక్షిణ ధృవమూను. రాంబాబు అధమం రోజుకి రెండుసార్లయినా స్నానం చేస్తే, రాజు రెండురోజులకొకమారైనా ఒళ్ళు తడపడు. వాడుత్త కాకిబాపతు. మడత నలగని బట్టలు కట్టుకోవడం రాంబాబు పద్ధతైతే – తొడిగిన బట్టలు ఒంటివి చిరగాల్సిందే కాని వాటికి వేరేవిధంగా విమోచనం ఉండకూడదు అనే సిద్ధాంతం రాజుది. సిగరెట్టు – బీడీలంటే రాంబాబు వాంతి చేసుకుంటాడు. రాజుకి అవి లేకపోతే క్షణంగడవదు. 'ప్రతీదీ ఒక పద్ధతిగా టైం

ప్రకారం జరగాలి?' అని రాంబాబుఅంటే 'టైమేవిటోయ్ గోంగూర? ఎప్పుడు ఏది అవసరంఅయితే అలా చేసిపడెయ్యడమే' అంటాడు రాజు. అప్పుఇవ్వడం రాంబాబుకి అలవాటు లేకపోవచ్చు. కాని అదితీసుకోకపోతే, ఇంకారోజల్లా రాజుకి మతిపోతుందే! ఒకడు పచ్చగా బంగారంలా బొద్దుగా ఎత్తుగాఉంటే, రెండోవాడు పీలగా నల్లగా పొట్టిగా ఏడుస్తాడు. ఇంతెందుకు? ఒకణ్ని తయారుచేశాక భగవంతుడు తమాషాగా సరదాకోసం సరిగ్గా వ్యతిరేక రూపంలో మరొకణ్ని సృష్టించాడా అన్నట్టుంటారు ఇద్దరూను.

అయితే, ఇద్దరిలోనూ కొన్ని సామాన్య గుణాలు లేకపోలేదు. నిజానికి అవే వాళ్ళిద్దరికీ స్నేహాన్నీ, విడిపోని అనుబంధాన్నీ కల్పించాయేమో. ఏమో - అయితే కావచ్చు.

'మనంతటి వాడులేడు. మనం చాలా తెలివైన వాళ్ళం అనే ధీమా, ఇద్దరిలోను సమపాళ్ళలోనేఉంది. అంతా మనకి తెలుసులే అనే ఆ అహంకారం పొరకి వెనకాల, నివురుగప్పిన నిప్పులా వేపకాయంత వెఱ్ఱి, ఆవగింజంత అమాయకత్వం ఉందన్న సంగతి తక్కిన వాళ్ళకి తెలియవలసిందే కాని ఛస్తే వాళ్ళకి తెలియదు. ప్రగల్భాలు పలకడంలో ఒకరికొకరు తీసిపోరు. అలాగని ఏదైనా పనిచెయ్యవలసి వచ్చినప్పుడు మాత్రం, దానిని ఎలా ఎగగొట్టడమా అనే ఆలోచనే ఇద్దరిదీను. ఖర్మం కాలి ఆ పని కనక వచ్చి నెత్తిమీదపడి, ఇంక చెయ్యక తప్పని పరిస్థితి ఏర్పడితేమాత్రం, వాళ్ళు చూపే కంగారూ, చేసే హంగామా, పడే త్రొక్కిసలాటా చూసితీరవలసిందే కాని వ్రాయనలవి కాదు.

అవునా? అలాంటి పక్షులతో కలిసి ఒకే ఆఫీసులో పక్క పక్కని పనిచెయ్యడం అంటే ఎంత ఇబ్బందో కాస్త ఆలోచించండి. వాళ్ళతో కలిసి తిరిగామా, 'ఒరేయ్! ఇద్దరు కాదురోయ్ వెఱ్ఱివాళ్ళు. ముగ్గురూ' అంటూ వాళ్ళ నామావళిలో నన్ను కూడా తక్కినవాళ్ళు ఎక్కడ చేర్చేస్తారో అని భయం - అలా తిరక్కుండా ఉందామా అంటే, అందుకు వీలులేని పరిస్థితీ.

ఎందుకు వీలులేదా? ఎందుకంటే, రాంబాబు స్వయానా నా క్లాసుమేటు. కలిసి బి.యే. దాకా చదువుకున్న వాడిని కాదంటూ దూరదూరంగా ఉండడం ఎలా? ఇంకపోతే రాజు! వాడిని అసలు వదలడానికి వీలులేదు. ఏమంటే, వాడిని తీసుకు వచ్చి ఉద్యోగంలో చేర్పించిన్నాడే 'బాబూ! మా వాడుత్త వెఱ్ఱిమేళం. పరధ్యానం సరుకు. కొంచెం నువ్వు కనిపెట్టి చూస్తూండు నాయనా!' అంటూ వాడి మెడనున్న గొలుసుని నాచేతికిచ్చి బాధ్యత అంతా నాకప్పగించి మరీ చక్కాపోయాడు వాళ్ళనాన్న.

అక్కడికీ తప్పించుకోవాలనే చూశాను నేను. "అదేవిటండీ ... అతనేం చిన్నవాడా? చితకవాడా? డిగ్రీ తీసుకుని ఉద్యోగంలో చేరబోతున్నవాడికి 'గార్డియన్' ఎందుకండీ పహిల్వాన్‌కి బాడీగార్డులాగ! అసలు నన్నడిగితే మీరుకూడా ఇంత దూరం రావడం అనవసరం అంటాను నేను. ఉద్యోగంలో చేరేవాడు ఆ మాత్రం స్వతంత్రంగా జేరలేడూ? వెనకాల మీరు ఉండాలా?" అన్నా. కాని ఆయన "కాదు నాయనా. నే నెందుకు చెపుతున్నానో విను" అన్నాడు ఆయన. అప్పుడు అలా ఎందుకు అన్నాడో తర్వాతకాని నాకు అర్థంకాలేదు.

ఇలా వీళ్ళిద్దరూ నాకు దఖలు పడ్డారా? సరే ..... ఈ బాధ్యత ఎలాగా తప్పదుకదా అని నాకు దగ్గర్లోనే ఒక రూమ్ చూసి 'అందులో వుండండ్రా' అన్నా వాళ్ళనిద్దర్నీ. రోజూ ఆఫీసుకి వెళ్ళేటప్పుడు బళ్ళోకి తీసుకువెళ్ళినట్లు నాతో పిల్చుకు పోవడం, తిరిగి వచ్చేటప్పుడు ఆ రెండుశాల్తీలనీ జాగ్రత్తగా రూమ్ దగ్గర దిగబెట్టడం, ఆఫీసులో అరగంట కోసారి వాళ్ళ సీట్లదగ్గరికి వెళ్ళి వాళ్ళేం చేస్తున్నారో ఆఫీసుపని ఎలా వెలగబెడుతున్నారో అజమాయిషీ చెయ్యడం, అవసరం అయితే వాళ్ళపని కూడా అప్పుడప్పుడు నేను చేసిపెడుతూ ఉండడం, ఆఫీసరు వేసే చివాట్లనుండి నా సాయశక్తులా తప్పిస్తూ ఉండడం – ఇదో నిత్యవిధి అయిపోయింది నాకు.

చేరిన కొత్తలో ఓరోజున ఆఫీసుకి శలవు పెట్టకుండా 'మేటనీ'కి చెక్కేశారు. తర్వాత ఆఫీసరు పిల్చి "శలవూ గిలవూ లేకుండా దొరలు మొన్న గైరు హాజరయ్యారేం? ఏం? 'మెమో' ఇమ్మంటారేవిటి?" అంటూ బెదిరించేసరికి, యిద్దరూ 'బేరు' మనే స్థితికి వచ్చారు. సమయానికి నేను అడ్డుకొని 'నిన్న వాళ్ళిద్దరూ లీవు పెట్టి నా చేతికి ఇచ్చారుసార్! పొరబాటున నేనే తమకి ఇవ్వడం మరిచిపోయానం'టూ సంజాయిషీ ఇచ్చుకున్నాను. ఆ తర్వాత 'ఏరా?' అని అడిగితే 'ఆరోజు శనివారం కదా! ఆఫీసు మధ్యాహ్నం ఉంటుందా?' అనే అతితెలివి అనుమానం ఒకటీ, తన్నేవాడు లేక! ఆ తర్వాత ఇద్దరూ ఉమ్మడిగానూ విడివిడిగానూ చేసిన ముచ్చట్లు చెప్పలేనన్ని.' వచ్చిన ప్రతి రూపాయి మణియార్డరుకీ, ఒక అప్లికేషన్ ఫారమ్ చొప్పున పంపించవయ్యా' అంటూ మేనేజరు పురమాయించి, వెయ్యి అప్లికేషన్ ఫారమ్‌లు ఇస్తే, అయిదు వందల రూపాయలకీ వెయ్యి ఫారాలూ పంపి ఊరుకున్నాడు, రాంబాబు ఓమాటు.

'ఏవిరా నిన్ను తగలెయ్యా ఇలా చేశావు?' అంటే,

'నేను జాగ్రత్తగానే పంపించానురా. ఈడబ్బులోనో ఫారాల్లోనో ఏదోమేజిక్కు ఉండి ఉంటుందిరా – నిజం ..... నిజం రా, నా మాట నమ్ము – ఒట్టు ..... నీతోడు' అంటూ నా నెత్తిమీద చెయ్యి పెట్టబోయాడు.

ఏవిటి ఇలా అయిందని ఆరా తీసి తెలుసుకుంటే తీరా వాడుచేసిన పని ఇది –

ప్రతీవాడూ తనకో ఫారం పంపవలసిందని ఉత్తరం రాస్తూ దాంతో తను కట్టిన మణియార్డరు బాపతు రశీదు కూడా జతపరుస్తాడుకదా – ఆ రశీదు చూస్తూనే 'ఇంకేం రశీదు ఉందిగా' రైట్' అంటూ ఓ ఫారం పంపేసేవాడు. మర్నాడు ఆ రశీదు తాలూకు మణియార్డరు వచ్చేది. 'మణియార్డరుకి ఒక ఫారంగా?' అంటూ మళ్లీ ఇంకో ఫారం ఆ ఆసామీకే పంపేవాడు. ఇలా ఒకే మనిషికి పంపిన ఒకే రూపాయికి రెండు ఫారాల చొప్పున పంపించేసి 'హమ్మయ్య' అని చేతులు దులుపుకొని కూర్చున్నాడు. చూస్తే, వచ్చినవి అయిదువందల రూపాయలూ, వెళ్ళినవి వెయ్యి ఫారాలూను.

ఈ సంగతి తెలిసి ఆఫీసరు నరసింహావతారం దాల్చి వాడిని చీల్చెయ్యడానికి సిద్ధం అయితే, ఆఫీసులోవాళ్ళం అంతాకలిసి వాడిని రక్షించేసరికి తాతలు దిగొచ్చారు.

ఇలాగే ఇంకోమాటు మేనేజరు అందరికీ అన్నిపనులూ అప్పగిస్తే, తనకి అప్పగించిన పనిని తగలెయ్యడం మొదలెట్టాడు రాజుగాడు. 'నాయనా నువ్వేం చెయ్యక్కర్లేదుకాని, వచ్చిన కవర్లుచింపి వాటిలోవున్న కాగితాలు మాత్రం తీసి జాగ్రత్తగా బొత్తుపెట్టు అంటే, 'ఓ – దానికేం?' అంటూ లోపల కాగితాల సమేతంగా కవర్లని చింపేసి మొత్తం 'కరస్పాండెన్సు' అంతనీ చింపి పోగులు పెట్టాడు. ఆ రోజున ఇద్దరం మనుష్యులం అడ్డుకున్నాంకనక లేకపోతే పిచ్చికోపంతో వాణ్ని మేనేజరు చావబాదేసి ఉండును.

ఆమధ్య ఓ రోజున, టైమయిపోయిందని రాంబాబు గబాగబా ఆఫీసుకి వస్తూంటే దారిలో చెప్పులు తెగిపోయాయట. ఈడ్చుకుంటూ ఎంతసేపు నడుస్తాం అని చెప్పి, చెప్పులు చేతబట్టి సరాసరి ఆఫీసరు రూమ్‌లోకి వెళ్ళిపోయాట్ట సంతకం పెట్టడంకోసం ఒగుర్చుకుంటూ. చేత్తో చెప్పు పుచ్చుకుని పెద్ద పెద్ద అంగలేసుకుంటూ తనకేసే వస్తూన్న రాంబాబుని చూసి 'ఏం అఘాయిత్యం చేస్తాడోరా దేవుడా!' అని కంగారుగా కుర్చీలోంచి లేచారట ఆఫీసరు తత్తరపాటుతో. ఆ తర్వాత స్థిమితంగా అర్థం అయిందట అది ఆయాసమేకాని ఆవేశంకాదనీ, చేతిలోనున్న చెప్పులు స్వార్థం కోసమే కాని, పదార్థంకోసం కాదనీను. అర్థం అయి ఆఫీసులో అందరికీ చెప్తే ఆయన నవ్వా, మేం నవ్వా. ఇంతమంది నవ్వుతూంటే అర్థం అయిచావదే వాడికి. పైగా 'మీరంతా ఎందుకు నవ్వుతారు?' అని ప్రశ్న ఒకటి!

ఔనా? మొన్నీమధ్య రాజు ఏం చేశాడు? పనిమాలా మేనేజరు దగ్గిరికి వెళ్ళి అతి సీరియస్‌గా 'అదేవిటండీ ఎప్పుడూ చెప్పారేకాదు! రవీంద్రనాథ ఠాగూరుగారు మీా బంధువులా?' అన్నాడు అందరూ ఉండగా. ఆయనకు మతిపోయి ఒక్కక్షణం ఆమట్టునే ఉండిపోయి, ఆ తర్వాత మహాఇబ్బందిపడిపోతూ 'ఏవిటయ్యా నువ్వేనేది? ఠాకూరు ఏమిటి, నా బంధువేమిటి?' అంటే 'దాచకండి సార్ ... నేను చూడలేదను కున్నారా ఏవిటి? నిన్న సాయంత్రం మీా సీటు దగ్గరికి వచ్చి 'ఇవాళ రాత్రి నేను భోజనానికి రానురా. అమ్మాయికి చెప్పు నాకు బియ్యం పొయ్యొద్దని' అంటూ వెళ్ళలేదా ఆ పొడుగులాల్చీ గెడ్డపాయన? కొంచెం ఆయనకి రికమెండ్ చెయ్యండి సార్ నా పద్యాలున్నాయి సర్ది పెట్టమని' అన్నాడు. అంతా నోరు ఆవలించి వింటూంటే ఆయనకూడా గుడ్లప్పగించి కాస్సేపుచూసి, ఆ తర్వాత విరగబడి నవ్వి 'ఓయ్ నీ అసాధ్యం గూలా? ఆయనా? ..... ఆయన మా పింతండ్రోయ్! ఈ మధ్య సన్యసించి గెడ్డంపెంచి లాల్చీ వేశాడు. అప్పుడప్పుడు ఇలా వస్తూంటాడులే" అన్నాడు. అంతా ఘొల్లుమని నవ్వి నాకేసి చూశారు. 'చూశావా మీా మిత్రుని తెలివి!' అన్నట్టు. చెప్పొద్దూ? నాకా క్షణంలో వాడిని చంపెయ్యాలన్నంత కోపం వచ్చింది.

ఆఫీసులో ఇలా అఘోరించేవాళ్ళు పోనీ రూమ్‌లోనైనా సజావుగా ఏడుస్తున్నారా అంటే అదీలేదు. ఓరోజు రాత్రి నేను సెకండు షో సినీమానుంచి తిరిగి వస్తూంటే, వేసివున్న వాళ్ళ తలుపుకి ఓ చిన్న హరికేన్ లాంతరు తగిలించి వుంది. ఇదేవిటా అని దగ్గరగా వెళ్లి వొత్తి హెచ్చించి చూద్దునుగదా, ఓ కాగితం జిగురుతో తలుపుకి పకడ్బందీగా అతికించి ఉంది. దానిమీాద పెద్ద పెద్ద అక్షరాలతో..

'ఈ రూమ్‌లో విలువైన సామాన్లేం లేవు' అని వుంది.

'ఆ రాతేవిటిరా మీా మొహాలు ఈడ్చా' అని మర్నాడు అడిగితే, 'అది అంతా దూరం ఆలోచించి చేశాంలే' అన్నారు. 'ఏవిటట ఆ దూరం ఆలోచన?' అన్నా -

'క్రితంరోజు మా ప్రక్క ఇంట్లో, ఆ క్రితంరోజు ఆ ప్రక్క ఇంట్లో ఇలా ఒక వరస ప్రకారం దొంగతనం జరుగుతోంది. ఆ లెక్క ప్రకారం చూస్తే నిన్న మా రూమ్‌లో జరగాలి దొంగతనం. తీరా దొంగతనం జరగడం, తలుపులు బద్దలుకొట్టి దొంగగారు లోపలికి ప్రవేవించడం, మేం ఇద్దరం ఝుడుసుకుని చావడం, ఖరీదైన సరుకేం లోపల దొరక్కపోయేసరికి ఆయనగారికి ఉడుకమోతుతనం వచ్చి మమ్మల్ని మెత్తగా దంచడం, ఇదంతా ఎందుకొచ్చిందని దూరం ఆలోచించి ఆ నాలుగు మాటలూ రాసి తలుపుకి అంటించాం. తీరా అంటించాక ఓ అనుమానం వచ్చింది, మనం రాసినది చీకట్లో ఆ వచ్చే దొంగకి కనిపించదేమో అని. అందువల్ల హరికెన్ లైటు

వెలిగించి ఆ పక్కని ఉంచాం. అంతే – మా ప్రయత్నం అమోఘంగా పనిచేసింది. రాత్రి మా రూమ్‌లో దొంగపడలేదు తెలుసా? ..... హుఁ!' అని హుషారుగా జమిలి కంఠాలతో డ్యూయెట్ పాడినట్లు గడగడా చెప్పేసి. ఆఖర్ని "కానయితే తెల్లారే టప్పటికి ఆ లైటు అక్కడలేదు అంతే!' అంటూ నీరసంగా ముక్తాయింపుపలికారు. అఘోరించినట్లే ఉందిలెండి మీ తెలివి' అన్నాను ఇంక ఎలా అనాలో తెలియక.

ఓఆదివారంనాడు నేను వాళ్ళరూమ్‌కి వెళ్లేసరికి ఇద్దరూ కూచుని పగలబడి నవ్వుకుంటున్నారు. పక్కన చూస్తే పిడతల్లో పెట్టిన రెండు జామి మొక్కలు కనిపించాయి. 'ఏవిటిరా కథ? నవ్వుతున్నారేవిటి?' అంటే పొటకచ్చేరీలో జోడు సన్నాయిలాగ ఒకళ్ళతో ఒకళ్లు పోటీపడుతూ ఇలా చెప్పారు –

'పొద్దున్నే జామిఅంట్లు పట్టుకొచ్చాడులే ఒకడు'.

'మాకు రేటు తెలియ దనుకొన్నట్టున్నాడు'.

'ఒకొక్కటి రూపాయి చెప్పాడు'.

'పోవోయ్ మాది కడియపు లంకే అంటూ బొంకాను'.

'దాంతో జంకాడు'.

'ఇంతకీ ఎలా ఇస్తావు? ఇచ్చే బేరం చెప్పు అన్నా'.

'వాడు చాలాసేపు తటపటాయించాడు'.

'చివరికి ఎంత కిచ్చాడో తెలుసా?'

'రెండూ అర్ధరూపాయికి'.

ఇద్దరూ పకపకా నవ్వారు. 'అంత చవగ్గా ఎవడిచ్చాడురా!' అని నాలో నేను అనుకున్నట్లుగా పైకి అన్నా.

'ఇవ్వకేం చేస్తాడు?'

'బేరమా మజాకా?'

ఒకళ్ళవేపు ఒకళ్ళు తిరిగి మీసం అయితే దువ్వుకో లేదుకానీ! అంతపనీ చేశారు వాళ్ళు చేసిన ఘనకార్యానికి.

సర్లేండి ఇంతకీ ఏం చేస్తారు ఈ మొక్కల్ని?' అన్నా.

'చేసేదేం ఉంది? పిడతలు బద్దలు కొట్టడం, అంట్లు రెండూ నేలలో పాతడం' అంటూ నవ్వారు.

'సరే కానియ్యండి. అద్దె యింటికి అలంకారాలు' అన్నా నిట్టూరుస్తూ.

'వన్, టూ, త్రీ' అని టప్‌మని చెరొకరూ చెరో పిడతనీ బద్దలుకొట్టారు. కొడితే ఏం ఉంది? ఆ పిడతలలో ఉన్నవి అంట్లూకాదు, మొక్కలూ కాదు. కొమ్మలు. కేవలం రెండు కొమ్మలు. రెండు మట్టిపితలలోనూ రెండు కొమ్మల్నిగుచ్చి అర్ధరూపాయి ఎగరేసుకుపోయాడు. వాడెవడో ఘటికుడు!

'ఒరేయ్ చూశారా? ఇదిరా మీ తెలివి!' అన్నా ఆకొమ్మలకేసీ, మట్టిపిడతల్లా విచ్చిపోయనవాళ్ళ ముఖాలకేసీ చూసి పకపకా నవ్వుతూ.

వాళ్ళేం తక్కువతిన్నారా? వెంటనే ప్లేటు ఫిరాయించి 'పోవోయ్ మాకు తెలియకేం కాదు. ముందే తెలుసు ఇవి కొమ్మలనీ వీటికి వేళ్ళులేవనీ. అయినా పోనీద్దూ పొద్దున్నే వచ్చాడు బీదవాడు ఓ అర్ధరూపాయితింటే ఏం పోయిందని ధర్మం చేశాం. లేకపోతే ఈ అద్దెకొంపని జామి మొక్కలతో అలంకరించేటంతటి వెర్రివాళ్ళం ఏం కాదు' అంటూ దబాయించారు.

ఇలాంటి సజ్జుకదా? వీళ్ళకి హంపీ గురించి చెప్పడం ఎందుకు, బతిమాలితే మాత్రం, కమలాపురం నాతో తీసుకవెళతానులెండి అని ఒప్పుకోవడం ఎందుకు? బుద్ధి గడ్డితిని అన్నాను, కమలాపురంలో మాఅన్నయ్య ఇంజనీరుగా ఉంటున్నాడు. ఈ సంక్రాంతి శెలవలు మూడు రోజులూ అక్కడికి వెళుతున్నాను. అక్కడికి హంపీ శిథిలాలు దగ్గరేకదా చూసివస్తాను" అని. ఇంక చూస్కోండి. దాంతో పట్టుకున్నారు ఇద్దరూ చెరోవేపూను. మమ్మల్నికూడా తీసుకువెళ్ళరా? నువ్వుతప్పిస్తె మాకా హంపీ శిథిలాలు ఎవరు చూపిస్తారురా' అంటూ.

'సరే బయల్దేరండి' అనగానే వాళ్ళ మధ్యన తగాదా తయారు. 'వీడుశుభ్రంగ స్నానంచేసి చాకలితెచ్చిన బట్టలు కట్టుకుంటేనే కాని మనతో రావడానికి వీలులేదు' అంటూ పెట్టాడు పేచీ రాంబాబు. 'అసలు నువ్వు నాకో పాతిక రూపాయలు బదులిస్తే నిన్ను ప్రయాణం కానిచ్చేది' అంటూ ఎదురు ఎత్తువేశాడు రాజు.

'నువ్వు నాలిక పీక్కున్నా నయాపైస ఇచ్చేదిలేదు' అని రాంబాబు అంటే, 'గోల పెడుతున్నావు కనక నేనీ గోనుగుడ్డలతోనే వస్తాను ఏవైనాసరే' అంటూ అక్కడే చదిగిలబడ్డాడు రాజు. 'వాడిష్టం వచ్చినట్లు వాడినిరానీ - నువ్వు వాడికేం అప్పు ఇయ్యక్కర్లేదులే - నేనిస్తాను. సరా?' అంటూ రాంబాబుని సమాధానపరచి, రాజుని సంతృప్తిపరచి బయలుదేరేసరికి రైలు టైమయింది.

'మీ కసలు టైము సెన్స్ లేదు, చప్పున నడవండి' అని రాంబాబు అరిస్తె,

'ఇదిగో నువ్వు టైము గీము అన్నావంటే నాకు చిర్రెత్తు కొస్తుంది' అంటూ సిగరెట్టు వెలిగించి పొగ మీదిమిదికి వదిలాడు రాజు. 'అదిగో వాడిని చూడుమరి' అంటూ రిపోర్టు చేశాడు రాంబాబు. 'ఒరేయ్ మీరిద్దరూ చెరోవైపూ ఉండండి' అని చెప్పి స్టేషనుకి బయలుదేరాను వాళ్ళతో.

మా స్టేషనునుంచి రైలు హోస్పేట స్టేషను చేరుకొనేదాకా, మాముగ్గురి మధ్య పులీ-మేకా-గడ్డిమోపూ-ఆట అయిందనుకోండి.

హోస్పేట స్టేషను దాటి ఇవతలకి వచ్చామోలేదో, రాజు ఓ పెద్ద తగాదా వేసుకున్నాడు పక్కనే సిగరెట్లు కొనుక్కుంటున్న ఓ పెద్దమనిషితో. తీరా విచారిస్తె 'కృష్ణదేవరాయలు కన్నడిగుడా తెలుగువాడా?' అన్న విషయంమీదా మాటామాటా ముదిరిందట. మనవాడు కన్నడీగుల్నీ, బళ్ళారిని, వాళ్ళు కాజేసిన పద్ధతినీ విమర్శించాడట. దాంతో ఆ పెద్దమనిషికి వళ్ళుమండి 'ఏవిటి అంటున్నావు?' అంటూ మీదకి వచ్చాడు. నేను ఆయన కాళ్ళూ కడుపూ పట్టుకుని బతిమాలి పంపించేటప్పటికి తలప్రాణం తోకకి వచ్చింది.

'ఎందుకురా నీకు ఆయనతో గొడవ?' అన్నా.

'నేనేం ఆయన్ని అనలేదురా, ఉత్తిపుణ్యాన్నే నామీద విరుచుకుపడ్డాడు' అన్నాడు బిక్కమొహం వేసుకొని రాజు.

'నీ మాసిపోయిన బట్టల్నీ స్నానం ఎరగని ఆ ఒళ్ళునీ చూసి బికారివాడు అనుకున్నాడేమో' అంటూ రాంబాబు పుసుక్కున నవ్వాడు.

'ఉహుం! పక్కని నువ్వున్నావుగా తెల్లని బట్టలలో వితంతువులాగ. అస్తమానూ కార్తీక స్నానాలు చేసి చేసి నిన్నుచూసే నన్ను లోకువ కట్టేడు' అన్నాడు రాజు.

'ఒరేయ్ ఇద్దరూ నోరు మూస్తారా ముయ్యరా? మిమ్మల్ని చూస్తె నాకు వళ్ళు మండిపోతోంది. తిరిగి మన ఊరు వెళ్ళేదాకా నోరు విప్పారంటే మిమ్మల్ని మధ్యలోనే వెనక్కి పంపేస్తాను జాగ్రత్త' అంటూ అరిచాను.

దాంతో బంద్!

ఇద్దరూ దారిలోనేకాదు, కమలాపురం చేరుకున్నాక కూడా నోరువిప్పితే ఒట్టు. మా అన్నయ్య పలకరించినప్పుడూ, మా వదిన అన్నం వడ్డించినప్పుడూ, మా అన్నయ్య గారి పిల్లలు దగ్గరికి వచ్చినప్పుడు నోరు మెదపకుండా ఎక్కువభాగం సంజ్ఞలతోనే పోనిచ్చారు మనవాళ్ళు. దాంతో 'ముభావంగా ఉన్నారు, వీళ్ళెవరో పెద్ద మనుష్యులు లాటోలు' అనుకున్నారు మావాళ్ళు.

ఆ మౌనం మౌనం మళ్ళీ మాఅన్నయ్య జీపులో మేం అంతా సాయంత్రం హంపీ శిథిలాల దగ్గరికి వెళ్ళేదాకా అలాగే ఉంది. ఆ శిథిలాలు చూసి, మూగివాళ్లకి ఒక్కమాటు మాట వచ్చినట్లు 'అబ్బ! వీటిని చూస్తుంటే కడుపు తరుక్కు పోతోందిరా' అంటూ రాంబాబు అరిస్తే, 'ఒకనాటి ఆంధ్ర మహాసామ్రాజ్యానికి ఎటువంటి దీనస్థితి!' అంటూ రాజు దీనంగా ముఖం పెట్టాడు. వాళ్ళ ఆంధ్రాభిమానం చూసేసరికి మా అన్నయ్యకి ఎక్కడలేని గౌరవం ఏర్పడినట్టుంది. ఎంతో ఓపికతో 'ఏనుగులశాల, దసరాగుట్ట, రాతిరథం, సప్తస్వరాలు, ఉగ్రనరసింహం, హజారా రామస్వామి దేవాలయం గురించి వివరంగా చెప్పసాగాడు. వాడు చెప్పిన గొప్పసంగతికీ సామాన్యమైన సంగతికూడా సమానంగానే 'అబ్బ! ఆహా! ఓహో! ఆ! నిజంగా?' అంటూ టెలిగ్రాఫిక్ లేంగ్వేజిలో తమ ఆశ్చర్యాల్ని బట్వాడా చెయ్యసాగారు.

కాస్సేపు అయ్యేసరికి మా అన్నయ్యకి అనుమానం వచ్చింది 'తను చెప్పింది వీళ్ళకి నిజంగా అర్థం అవుతుందా లేదా' అని. నాకేసి ప్రశ్నార్థకంగా చూశాడు. నేను ముఖం ఇంకోవైపు తిప్పాను. ఇంతలో తుంగభద్రలో స్నానం చెయ్యడందగ్గరా రామస్వామి దేవాలయంలో సిగరెట్టు కాల్చడం విషయంలోనూ, రాజూ రాంబాబూ వాగ్వాదం వేసుకున్నారు కాని లేకపోతే వాళ్ళు అదే టెలిగ్రాఫిక్ లాంగ్వేజిని మరికొంచెం సేపు ఉపయోగిస్తే, వాళ్ళ అసలు స్వరూపాన్ని మా అన్నయ్య కనిపెట్టేసి ఉండును.

విరూపాక్ష దేవాలయం ముందున్న విశాలమైన వీధినీ, అక్కడ పువ్వులమ్ము తున్న ఆడవాళ్ళనీ చూసేసరికి, రాజుకి ఏం తన్మయత్వం కలిగిందో ఏమో, ఓ పద్యం అందుకున్నాడు 'ఇచ్చోటనే కదా ....'' అంటూ. వెంటనే నాలిక కరుచుకుని ఇది జాషువాగారి పద్యం కదూ ఇంకా కొడాలివారిది అనుకున్నాను అన్నాడు.

జ్వరం దిగినట్లు కాస్త భావావేశం దిగిన తర్వాత 'ఈ పువ్వులమ్మే పుష్పలావికల గురించి కృష్ణదేవరాయలు తన ఆముక్త మాల్యదలో ఏం శృంగారవరంగా చెప్పాడు! ఇచట పుట్టిన చిన్నపిల్లయినా జాణ!' అని అరుస్తూ, పెద్ద పెద్ద అంగ లేసుకుంటూ పువ్వులమ్ముతున్న ఒక అమ్మాయి దగ్గరికి వెళ్ళి 'వెలది యీ నీ దండ వెల ఎంత' అంటూ ప్రశ్నించాడు రాగయుక్తంగా.

అది ఏ బాపతు పైత్యమో అర్థంకాక ఆ అమ్మాయి వాడికేసి తెల్లబోయి చూసింది. వీడేదో అల్లరిచేసేలాగ ఉన్నాడని భయపడి నేను గబగబా అటు వెళ్ళబోయాను కాని అప్పటికే అనవలసిన మాటేదో అనేశాడు 'ముగ్ధలాగ తెల్లబోతా వేమిటి జాణా!' అంటూ.

ఆ అమ్మాయికి 'జాణ!' అనేమాట అర్థం అయినట్టయింది 'ఔరౌర! ఎవడివిరా నువ్వు? జాణ అంటావా' నా జాణతనం ఏం కనిపెట్టావు?' అంటూ కచ్చాబిగించి ఒంటికాలిమీద లేచింది.

మాఅన్నయ్య 'ఇలాంటివాడిని తీసుకు వచ్చావేమిటిరా!' అన్నట్లు కొంచెం ఇబ్బందిగా నాకేసి చూశాడు. నాకు తలకొట్టేసి నట్లయింది. చుట్టూ జనంపోగయే ప్రమాదం కనిపెట్టి, గబగబా ఆ అమ్మాయి దగ్గరికివెళ్ళి, బతిమాలి, వాడు మతిస్థిరం లేనివాడని చెప్పి, నమ్మించి, చేతిలో రెండు రూపాయలు పెట్టి, గొడవ పెట్టవద్దని బతిమాలి, రాజుని తీసుకువచ్చి జీపులో కూలేశాను.

మా అన్నయ్య మౌనాన్నీ నా గాంభీర్యాన్నీ అర్థంచేసుకున్నట్టున్నాడు, దారి పొడుగునా రాంబాబు రాజు బాబుని తిడుతూనే ఉన్నాడు. 'అదేవిట్రా నన్ను ఉత్తి పుణ్యాన్నే అనవసరంగా తిడతావు? నేనేం చేశాను?' అని రాజు మొరాయిస్తూనే వున్నాడు.

ఆరాత్రి భోజనా లయాక అతిథులుకదా అని ఇంట్లోఉన్న రెండు మంచాలూ వాళ్ళకి సమర్పించి, మాఅన్నయ్యా వదినా పిల్లలూ నేలమీద పక్క వేసుకుని పడుకున్నారు. ప్రక్కనే నాకు కూడా చాప వేశారు. వరండాలో రాంబాబూ రాజూ ప్రక్కనున్న హాల్లో మేమూ. నేలమీద పడుకోవటం అలవాటు లేకపోవడంవల్ల హాల్లో ఉన్న మాకెవళ్ళకీ చాలాసేపటివరకూ నిద్దర్లు పట్టలేదు. అటూ ఇటూ దొర్లుతూ ఇంకా ఏవో కబుర్లు చెప్పుకుంటూనే ఉన్నాం.

ఇంతలో వరండాలో రెండు పిల్లులు దెబ్బలాడు కుంటున్నట్లు మాకు వినిపించింది. అయ్యో పాపం పెద్ద మనుష్యులు కూడా పడుకున్నారు. వాళ్ళ కీ పిల్లులు నిద్రాభంగం చేస్తాయో, దెబ్బలాడుకుని దెబ్బలాడుకుని మీదికే ఉరుకుతాయో అని భయపడి, వాటిని తరిమెయ్యడంకోసం మాఅన్నయ్య కర్రపుచ్చుకొని తలుపు తీసుకొని వరండాలోకి వెళ్ళాడు. వెనకాలే నేనూ వెళ్ళాను. అక్కడ పిల్లులూలేవు, కుక్కలూ లేవు. మరి ఆ శబ్దం ఎవిటి? ఇటు తిరిగిచూస్తె, ఆగందరగోళపు శబ్దం అంతా సృష్టిస్తున్నది జంతువులు కాదనీ, కేవలం ఒక మానవుడనీ, అందునా మా రాంబాబనీ స్పష్టంగా తెలిసింది. పగలంతా పడిన శ్రమకి పాపం వాడి స్థూలకాయం హాయిగా నిద్రలోకి సోలిపోతే మెళుకువగా ఉన్న జీవుడుమాత్రం నోటిలోంచీ ముక్కులోంచీ బయటికి లోపలికి వస్తూపోతూ ఉన్నాడు, మేళతాళాలతో సదరు శబ్దాన్ని వివిధ రాగ తాళగతుల్లో యధాశక్తిగా సృష్టిస్తూ,

మేం కర్రలు పట్టుకొని తలుపు తెరుచుకు రావడం హడావిడికి రాంబాబుకి అయితే మెలుకువరాలేదు కానీ, రాజు మాత్రం 'ఏమిటి ఏమిటి' అంటూ కంగారుగా లేచి కూర్చున్నాడు. లేచి, పక్కమంచం మీద నిద్దరోతూ రాంబాబు చేస్తూన్న అఘాయిత్యానికి ఎంతో నొచ్చుకొని 'ఒరేయ్ ... లే .... నీకేం బుద్ధి ఉండక్కర్లే? లెమ్మంటూంటే! ఏదో పెద్ద మనుష్యులంకదా అని మనకి మంచాలూ పక్కలూ వేసి మర్యాద చేస్తె గుర్రు పెడతావుట్రా రాస్కెల్! మంచీ చెడ్డా ఉండక్కర్లే?' అంటూ, ఇంతక్రితం తనుజీపులో వచ్చేటప్పుడు రాంబాబువడ్డించిన తిట్లకి చక్రవడ్డీతోసహా అప్పు తీర్చడం ప్రారంభించాడు. పనిమాలా నిద్రలేపి ఆ అర్థరాత్రివేళ వాడు తనని అలా ఉట్టి పుణ్యానికి ఎందుకు తిడుతున్నాడో అర్థంకాక తికమక పడ్డాడు రాంబాబు.

ఆసమయంలో మాఅన్నయ్య మొహం చూడడానికి నాకు సిగ్గేసింది. ఇంక లాభం లేదు. వీళ్ళ కథఅంతా అర్థంఅయేదాకా ఇక్కడ ఉంచడం కంటే పెందరాళే ప్రయాణం కట్టించడం మంచిది అంటూ తిరుగు ప్రయాణం గురించి ఆలోచించ సాగాను. నేను ఆలోచిస్తూనే ఉన్నాను. మా అన్నయ్య ఇంకా ఏదో చెప్తూనే ఉన్నాడు. మా వదినా పిల్లలూ నిద్రపట్టక అటూ ఇటూ దొర్లుతూనే ఉన్నారు. ఆసమయంలో వసారాలోంచి రాజు కాబోలు గట్టిగా అరిచాడు. 'ఏయ్! ఎవరు నువ్వు? ఏమిటిలా మీదమీదకి వస్తావు? ... ఆ ..... ఏమిటది? కత్తే? ... అమ్మో!' అంటూ.

ఒక్క అంగలో నేనూ అన్నయ్యా తలుపు తెరుచుకొని వసారాలోకి ఉరికాం, ఏం ప్రమాదం జరుగుతోందో అని భయపడ్తూ. తీరా అంత కంగారుగానూ వస్తె అక్కడ ఏం ఉంది?

గుండెలమీద చేతులేసుకొని హాయిగా నిద్రపోతూ ఉన్నాడు రాజు. రాంబాబు మాత్రం వాడికేసి కసిగా నమిలి మింగేసేలాగ చూస్తున్నాడు.

'ఏవిరా? వాడిని ఏం చేశావు?' అన్నా కంగారుగా.

'నేనేం చేశాను? వెధవ పలవరింతలూ వీడూను. పరాయి ఇంటికి వచ్చాం అనే సిగ్గూ లజ్జాలేకుండా, ఇది వాడి రూమ్ అనుకుంటున్నాడు కాబోలు!' అంటూ అసహ్యంగా నిద్రపోతూన్న రాజుకేసి చూశాడు.

మా అన్నయ్య నవ్వు ఆపుకోలేక పోయాడు.

నాకు చెప్పొద్దూ పిచ్చి కోపం వచ్చేసింది వాళ్ళిద్దరిమీద. గుర్రుపెట్టడం, పలవరించడం, ఏదో అఘోరించడం – అది సరే, ఒకరిమీద ఒకరు ఈ వెఱ్ఱి

కామెంట్స్ ఏమిటి, క్రీడావాఖ్యాత పుస్తక సమీక్ష చేసినట్టు? ఇంక లాభంలేదు. వీళ్ళని ఎంత చప్పున తిరుగుటపా కట్టిస్తె అంత మంచిది అనుకున్నా.

లోపలికి వచ్చి మా అన్నయ్య పొట్టచెక్కలయిపోయేలాగ నవ్వి 'ఒరేయ్ నీ స్నేహితులు భలేవాళ్ళురా. వాళ్ళయితే సహం రాత్రిని ఒకళ్ళూ సహం రాత్రిని మరొకళ్ళూ చక్కగా పంచుకొని హాయిగా నిద్రపోయారు. మనకిమాత్రం శివరాత్రి చేసి వదిలారు' అన్నాడు.

'వీళ్లెక్కడ దొరికారోయ్ నీకు' అంటూ మా వదిన సన్నగా నవ్వింది.

మా అన్నయ్యగారి పిల్లలు సరేసరి మాటి మాటికీ నా చెవిదగ్గరికి వస్తూండడం,

"బాబయ ఫ్రెండ్సూ బఫూన్ బ్రాండ్సు"

అంటూ ఓ చరణం పాడి పోతూవుండడం.

ఇంకావుంటే మన కీర్తి ఆ ఊరు ఊరంతా వ్యాపించి, జనం అంతా తండోప తండాలుగా వాళ్ళని చూడ్డానికి రావచ్చునీ, అలావస్తే వాళ్ళని తప్పించుకుని బయటపడడం, 'బ్లేక్ మనీ' బయట పడడంలా చాలా కష్టసాధ్యం అవుతుందనీ ఆలోచించి, మా అన్నయ్యా వదినా ఎంత పట్టుబట్టినా వినకుండా, మర్నాడు సంక్రాంతి అని అయినా ఆలోచించకుండా, తిరుగు ప్రయాణం కట్టాను.

కడితే 'ఒరేయ్ రెండు మూడు రోజులు ఉందాం అని వచ్చాం కదరా' అని ఓ ప్రక్కనుంచి రాజూ, 'అప్పుడే ప్రయాణం ఏమిటిరా? పైగా పండగ పూటాను, మీ అన్నయ్య వాళ్ళూ ఏమైనా అనుకుంటారేమో' అని మరో ప్రక్కనుంచీ రాంబాబూ, జోడు సన్నాయిలాగ.

'ఓరి మీ మొహాలు మండా! ఇప్పటిదాకా తన్నుకున్నారు! ఇందులో మళ్ళీ ఏకవాక్యం వచ్చిందీ!' అన్నా ఆశ్చర్యంతో.

'అది కాదురా అప్పుడే ప్రయాణం అంటే ...' అంటూ గట్టిగా ఏదో చెప్పబోయారు ఇద్దరూ.

'మీరు నోరు ముయ్యండిరా ముందు' అంటూ వాళ్ళ అంగుళ్ళునొక్కి మా అన్నయ్యనీ వదిననీ ఒప్పించి తిరుగుప్రయాణం స్థిరపరిచేసరికి బ్రహ్మ ప్రళయం అయింది.

మర్యాదకోసం హోస్పేట దాకా మా అన్నయ్య వచ్చాడు మాతోపాటు. దార్లో రాంబాబుని రెండు రూపాయలు బదులు ఇమ్మన్నాడు రాజు.

'అదుగో అక్కడే నాకు మండుకొచ్చేది' అన్నాడు రాంబాబు.

'ఒరేయ్! అందరి డబ్బూ నీ దగ్గరే ఉందికదరా పోనీ నా డబ్బులో ఓ రూపాయి ఇయ్యి వాడికి' అన్నా.

కోపంగా చూస్తూ, వాడి సొమ్మంతా పోయినట్టు పర్సులోంచి ఓ రూపాయితీసి దానికి మరో రూపాయి అంటుకుందేమో అని పదిసార్లు విదిలించి మరీచూసి ఆ తర్వాత విసురుగా వాడిచేతిలో పెట్టాడు రాంబాబు. నీపని ఇలా ఉందా అని, ఆ రూపాయితో సిగరెట్లు కొనేసి. దారి పొడుగునా రాంబాబు మొహంమీదికి పొగ ఊదుతూనే ఉన్నాడు రాజు.

మేం స్టేషనుకి చేరుకొనేసరికి రైలు వచ్చేసింది. ఇంక రాజూ, రాంబాబుల రన్నింగ్ రేస్ చూసితీరాలి.

ఒకడు బుకింగ్ వేపూ,

రెండోవాడు బేగ్‌లు పుచ్చుకుని తిన్నగా ప్లాట్‌ఫారం మీదకీ ఒకటే పరుగు వెనకనించి 'తొందరలేదని నేనూ మా అన్నయ్యా ఎంత అరుస్తున్నా వినిపించు కోకుండా.

గేట్‌దగ్గర ఆపుచేసిన టిక్కెట్టు కలెక్టరుని చూచేసరికి రాంబాబుకి ఏం మండుకొచ్చిందో ఏమో, వెనక్కి తిరిగి 'ఏంరా? టిక్కెట్లు ఇంకా తేవేం?' అంటూ రాజుని కసురుకున్నాడు, అత్తమీద కోపం దుత్తమీద చూపించినట్లు.

కలలో తేరుకున్నట్లు - ఒక్కమాటుగా తెలివి తెచ్చుకుని, అంతకంటే రెట్టింపు కోపంతో 'పర్సు నీ జేబులో పెట్టుకుంటే టిక్కెట్లు నేనెలా తెచ్చేది?' అంటూ గయ్యి మన్నాడు వెనక్కి తిరిగి వచ్చి, రాజు.

'ఓహో!' అంటూ జేబులో డబ్బుతీసి రాజుకి ఇచ్చే హడావిడిలో, చేతుల్లో ఉన్న బరువైన బేగ్‌లు రెండూ టికెట్ కలెక్టరు రెండు పాదాలమీదా పెట్టేసి ఆయన 'ఏయ్! ఏవిటిది?' అంటే, వెంటనే బేగ్‌లు తీసేసి 'పొరబాటయింది సార్!' అంటూ క్షమార్పణ చెప్పుకున్నాడు రాంబాబు.

'తొందరేం లేదయ్యా మహానుభావా!' అంటూ మా అన్నయ్య వచ్చినా వాళ్ళిద్దర్నీ స్థిమితపరిచినా వినకుండా, ఎందుకేనా మంచిదంటూ ఇద్దరూ కలిసి నా

చేతిలో బేగ్‌కూడా తీసుకుని, కంగారుగా రైలు దగ్గరికి పరుగెట్టి, మొత్తం బేగ్‌లు మూడూ లోపల పెట్టేసి 'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకున్నారు, ప్లాట్‌ఫారం మీద జనం అంతా వాళ్ళని వింతజంతువుల్లా చూస్తున్నా అదేం పట్టించుకోకుండా.

'రైలు ఇప్పుడప్పుడే వెళ్ళదు నామాట నమ్మండి' అని మా అన్నయ్య చాలా సేపు నచ్చచెప్పాకకాని వాళ్ళకి నమ్మకం కుదిరి మాతో టీస్టాల్‌కి బయలుదేరలేదు. బయలుదేరినా, వాళ్ళ చూపులుమాత్రం వెనకే వెనకే, రైలువేపే ఉన్నాయి. 'లోపల బేగ్‌లు కూడా పెట్టాం ఖర్మ' అన్నట్లున్నాయి వాళ్ళచూపులు.

టీ తాగుతూనే ఉన్నారు మాతో. మధ్య మధ్య మేం అడిగినదానికి సమాధానాలు చెబుతూనే ఉన్నారు కాని, ఓ కంట రైలుని కనిపెడుతూనే ఉన్నారు రాజూ రాంబాబూను.

ఇంతలో 'కంయ్' మని ఇంజను కూసింది.

'అమ్మ బాబోయ్!' అంటూ ఇద్దరూ పరుగు లంకించుకున్నారు, ఒకడు కప్పుతో సహాను, ఇంకొకడు కప్పు విసిరేసీను.

ఇంక చూసుకోండి ఫార్సు!

ఆ విసిరేసిన కప్పులో టీ వెళ్ళి, పక్కనుంచే నడుస్తూన్న ఓ పడుచుపిల్ల తెల్లని చీరమీద పడితే ఆ అమ్మాయి మనవాళ్ళని నానా ఆశీర్వచనాలూను. రెండో వాడి చేతిలో టీ, కంగారుగా పరిగెట్టడంవల్ల ఒయ్యారాలు ఒలకబోసి, వాళ్ళిద్దరి బట్టల మీదా కొత్త కొత్త అర్ధకాలు ముద్రించింది.

వాళ్ళింకా పరిగెడుతూనే ఉన్నారు.

వెనకనుంచి ఆ పడుచుపిల్ల దీవిస్తూనే ఉంది.

టీస్టాల్ దగ్గర్నుంచి 'తొందరలేదంటూ' మా అన్నయ్య అరుస్తూనే ఉన్నాడు.

ప్లాట్ ఫారం మీద జనం పోగయి నవ్వుతూనే ఉన్నారు.

అంతా గందరగోళంగా

అయోమయంగా

హడావిడిగా తెలుగు సినీమాలో క్లయిమాక్సు సీనులాగ కలగా పులగంగా అయిపోతోంది.

ఇంతలో దిబ్బుమన్న పెద్ద శబ్దం వినిపించింది. చూస్తే ఏం ఉంది?

రాజూ రాంబాబూ అడ్డంగానూ నిలువుగానూ + గుర్తులాగ ఒకళ్ళమీద ఒకళ్ళు పడి ఉన్నారు, ప్లాట్‌ఫారానికి అడ్డంగా.

'అయ్యో ... అయ్యో .....' అంటూ జనం అంతా చుట్టూ మూగి 'తొందరేందు కయ్యా! ఇంజను ఒక్కటే 'వాటరింగ్'కి పోతోంది. రైలు ఇప్పుడప్పుడేకదలదు. భలేవారే! అనవసరంగా కంగారుపడి కాళ్ళు విరగ్గొట్టుకున్నారు ... లేవండి' అన్నారు.

ఈలోగా మాఅన్నయ్యా నేనుకూడా వాళ్ళని సమీపించాం, నేను కూడా ఆ జనంతోపాటే చెయ్యి సాయం చేస్తూ 'లేవండర్రా' అన్నా.

'లేవరే!' –

వటపత్రశాయిలా ఒహడూ, కంచి వరదరాజస్వామిలా మరొహడూ, ఆ మట్టునే పడుకొని ఉన్నారు, ఆ ప్లాట్‌ఫాంమీద.

నా ముఖంమీద కనిపించిన ఆదుర్దా చూసి కాబోలు 'మీవాళ్ళా బాబూ!' అన్నారు అక్కడ మూగినజనం అంతా.

నేను సిగ్గుతో సగం చచ్చి, కోపంగా మళ్ళీ 'లేవండిరా' అన్నా.

ఉహుఁ!

ఏ మాత్రం కదలకుండా 'అసలు వీడే నన్ను పడగొట్టాడు నా కాళ్ళకి అడ్డంపడి' అంటూ రాజుకేసి రాంబాబు పుల్తూ పుల్తూ చూశాడు.

'అసలు నిన్ను నాపక్కపక్కనే ఎవరు పరిగెట్టమన్నారోయ్?' అంటూ చేతిలో ఉన్న కాళీ టీకప్పు ముక్కని, గాలిలో ఊపుతూ ప్రశ్నించాడు రాజు.

'ఇంతకీ మీరు లేస్తారా? లేవరా' అన్నా.

వాళ్ళు ఒకళ్ళకేసి ఒకళ్ళు చూసుకున్నారు, ఏరా లేద్దామా అని కూడపలు క్కుంటున్నట్టు.

తక్కినవాళ్ళ మాటకేం గాని, ప్లస్ గుర్తులా పడిఉన్నవాళ్ళిద్దర్నీ చూసి, ఇందాకటి కోపం పోయి పకపకా నవ్వుతూన్న పడుచు పిల్లమాత్రం నాకేసి చూసింది 'నాయనా వీళ్ళస్నేహితుడివి నువ్వా?' అన్నట్లు.

నాకు తల కొట్టేసినంత పని అయింది, వీళ్ళిద్దరితో కలవడంవల్ల, నేనూ వీళ్ళతో సమానంఅయ్యానుగదా, ఈ జనందృష్టిలో అనే ఆలోచనతో.

గార్డు విజిల్ ఊదకపోతే రాజూ, రాంబాబూ ఇంకా అలాగే + గుర్తులా పడి ఉందురు.

చూసే జనంఅంతా ఇంకా నన్ను వాళ్ళతో 'ఈక్వేట్' చేసిఉందురు. ఏవంటారు? అవునా!

(కానుక, 1971)

*